# మరో మార్క్స్ పుట్టాలె!

రాత్రి పన్నెండు దాటింది. బయట కుక్కలు మొరగటం కూడా ఆగిపోయింది. అంతా నిశ్శబ్దం. అప్పుడప్పుడూ ఓ మోటార్‌బైక్ ఓ కారు పోయిన చప్పుడు మాత్రం వినిపిస్తున్నది. రోడ్లమీద లైట్లు గుడ్డి గుడ్డిగా వెలుగుతున్నాయి. మనుషుల జాడ లేదు. తాగుబోతులు తప్పతాగి అక్కడక్కడ పేవ్‌మెంట్ల మీద సోయి తప్పి పడివున్నారు. అంతా నిశ్శబ్దం! కిరణ్ ఎప్పుడు ఇంటికి వస్తాడో రమకు అంతుపట్టటం లేదు. రోజు తొమ్మిదింటివరకు ఇంట్లో వుండేవాడు. కాని ఈ మధ్య ఆలస్యంగా రావటం మామూలే అయింది.

ఈరోజు పన్నెండు దాటినా ఇంకా రాలేదు. రోజూ కునికిపాట్లు పడుతూ రమ కిరణ్‌కోసం ఎదురు చూడటం అలవాటే. కాని ఈరోజు అర్ధరాత్రి దాటింది. నిద్ర పోదామన్నా ఆమెకు నిద్రరావటం లేదు.

ఇంకా కిరణ్ రాలేదెందుకు? –ఇదే ఆందోళన ఆమె మనస్సును కలచి వేస్తున్నది.

"మనకు రాత్రి అయితే అమెరికాలో పగలు కద. అమెరికాలోని హెడ్ ఆఫీసులో ఉద్యోగులు వచ్చింతర్వాత వాళ్ళతో పని విషయం మాట్లాడిం తర్వాత మేం ఆఫీసు నుంచి బయట పడాలి!" – పెండ్లి అయిన కొత్తలోనే తన ఆలస్యానికి కారణం చెప్పాడు కిరణ్.

కాని ఈరోజు ఇంత ఆలస్యమైందెందుకు? కిరణ్ ఇంటికి రాందే రమకు నిద్రపట్టదు. రోజూ అంతే! కాని ఈరోజు అర్ధరాత్రి దాటింది. అదే జాగరణ! – ఈరోజు ఇంతసేపయినా కిరణ్ రాలేదెందుకు? – మనస్సులో భయం రాజుకుంది రమకు. ఫోనుచేసి అడుగుదామంటె ఇంటి నుంచి ఫోనులు రాకూడదని వాళ్ళ బాస్ ఆదేశాలు! ఇరవై వేల మంది పని చేస్తున్నారు ఈ కంపెనీలో. ఇరవై వేల ఫోన్లు ఎప్పుడో అప్పుడు మోగుతుంటే ఎట్లా వుంటుంది! బాస్ చేరిన కొత్తలో చెప్పాడట! రమ ఫోను చేయడానికి వీల్లేదు. "సెల్ ఫోనులో మాట్లాడుతూ సమయాన్ని దుర్వినియోగం చేయొద్దు! అది నేను సహించను.

పైన హెడ్ ఆఫీసుకు నేను సమాధానం చెప్పుకోవాలె-" అని బాస్ ఆజ్ఞలు జారీ చేసాడు. ఆధునికమైన మానేజిమెంట్‌లో మానవ మనోభావాలకు స్థానం లేదు మరి! కాబట్టి కిరణ్ ఫోను చేయటం సాధ్యం కాదు. పని! పని! పని ఏ విధంగా ఆగకూడదు. రాక్షసత్వానికి మరో పేరు పని సంస్కృతి.

ఒంటి గంటయింది! – గోడ గడియారం వైపు చూసింది రమ. ఒంటి గంటయినా ఆమె కండ్ల రెప్పలు నిద్రతో వాలటం లేదు. చింతతో భయం భయంగా వున్నాయి. పెండ్లయిందగ్గర్నుంచి ఇదే వరస. ఆఫీసునుంచి ఎప్పుడొస్తాడని ఎదురుచూడటం. పెండ్లికి ముందే కిరణ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాడు. కిరణ్ సంబంధం వచ్చినప్పుడు రమ తల్లిదండ్రులు సంబరపడిపోయారు – "పిల్లవాడు సాఫ్ట్‌వేర్ ఇంజనీయర్. మంచి పేరున్న ఇంటర్నేషనల్ కంపెనీలో పని చేస్తున్నాడు. జీతం నెలకు నలభై వేల పైనే అట! రమ సుఖపడ్తుంది" అనుకున్నారు.

రమ తండ్రి ఇంజనీయరే. ఆయన రిటైర్ అయ్యేనాటికి రెండువేల జీతం కూడా లేదు! ఎంత తేడా! మొదట్లోనే కిరణ్‌కు ఇంత జీతమంటె రాను రాను బాగా అభివృద్ధిలోకి వస్తాడు. కూతురు చాల అదృష్టవంతురాలు – అనుకుంది రమ తల్లి.

ఉద్యోగం చేసే అమ్మాయి వద్దు అనే కిరణ్ రమను ఇష్టపడ్డాడు. ఇద్దరు ఉద్యోగంలో వుంటె పిల్లల్ని ఎవరు చూసుకుంటారు! – అనే ఉద్దేశంతో కిరణ్ రమను పెండ్లాడడానికి ఒప్పుకున్నాడు. చిన్నప్పట్నుంచి చదువు! చదువు! – అని అతని తల్లిదండ్రులు అతన్ని హాస్టల్లో పెట్టారు. అందుకేనేమో కిరణ్‌కు తనను పిల్లల్ని చూసుకునే భార్య కావాలను కున్నాడు. రమ బి.ఏ. చదివింది. కాని ఆమెకు మొదటినుంచి ఉద్యోగం చేయాలన్న కోరికలేదు. తల్లిదండ్రులకు ఒక్కతె కూతురు. ఒక తమ్ముడున్నాడు. తల్లి రమను వంటింటి జాడలకు రానిచ్చేది కాదు. "ఇప్పట్నుంచే ఈ చాకిరంత ఎందుకు? పెండ్లి అయింతర్వాత ఎట్లయిన తప్పదు!" – అనేది. కాని కిరణ్ సంబంధం కుదిరినంక తల్లి రమను మెడలు వంచి వంటింట్లోకి పిలిచి అన్ని రకాల వంటలు నేర్పింది. ఇన్నాళ్ళు ఇంటిపని వంటపని అలవాటు లేకున్నా రమ తొందరగానే వాటికి అలవాటు పడింది. పెండ్లి కాంగనే కిరణ్‌కు ఏ లోటు రాకుండా ఇల్లాలి బాధ్యతలు నెత్తినేసుకుంది. ఆ విషయంలో కిరణ్‌కు ఏ చింతలేదు. తర్వాత పిల్లలు పుట్టారు. రమ ఇంటి బాధ్యతలు కూడా పెరిగాయి. అయినా ఏ లోటు కనబడకుండా రమ సంసారం నడిపిస్తున్నది. కిరణ్ నిశ్చింతగా ఆఫీసులో పనిచేస్తూ బాధ్యతగల ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు. ప్రమోషన్లు సంపాదించుకున్నాడు. అతని ప్రమోషన్లతోపాటు పనిగంటలూ పెరుగుతూ వచ్చాయి. ఇంటిమొఖం చూడకుండా ఏం ఉద్యోగం? – అని అప్పుడప్పుడు రమ గుండె బరువెక్కేది. "ఈరోజు ఏమైందో మరి అర్ధరాత్రి దాటినా కిరణ్ ఇంకా ఇంటికి రాలేదు!" రమ అశాంతిగా లేచి నిలబడి కిటికీలోంచి బయటికి చూసింది. అంతా నిశ్శబ్దం! కిరణ్ వచ్చిన అలికిడి లేదు.

ఒంటిగంట దాటింది! – గడియారం ముల్లు ముందుకు కదులుతుంటె రమ అశాంతి పెరుగుతూనే వుంది. ఇద్దరు పిల్లలు రోజులాగానే తండ్రికోసం ఎదిరి చూడకుండా తమ హోమ్‌వర్క్‌లో సాయం చేస్తే చేసుకొని భోంచేసి పడుకున్నారు. శని, ఆదివారాలు

సెలవు రోజుల్లో తప్పితే వాళ్ళకు తండ్రిని చూడటం అతనితో మాట్లాడటం ఆడుకోవటం జరుగదు. చాలాసార్లు ఆ శని ఆదివారాలు కూడా కిరణ్ ఆఫీసు పని అంటూ వెళ్ళిపోతాడు. అది ఈ మధ్య మరీ ఎక్కువయింది!

"ఇదేమిటి? శనివారం కూడా ఆఫీసా?" – రమ గునిస్తే

"తొందరగా వచ్చేస్తాను గదా! నేను రాంగనే పిల్లలతో ఎటైనా బయటికి పోదాం. పిల్లలకు చాట్ ఐస్‌క్రీమ్ తినిపించి చాలా రోజులైంది. సాయంత్రం వంట చేయకు రమ! నేను రాంగనే పోదాం. రెడీగా వుండండి!" – అని పరిగెత్తిన కిరణ్ రాత్రి పదయినా పత్తా వుండటం లేదు. తండ్రి కోసం ఎదిరి చూసి ఎదిరి చూసి పిల్లలు నిద్రలోకి జారుకుంటారు.

ఈరోజు ఏమైంది? – ఒంటిగంట దాటింది! ఇంకా కిరణ్ ఇంటికి రాలేదు. ఇంత పనేంది?

"పాడు కంపెనీ! – ఆ పాడు కంపెనీ మునిగినకాన్నుంచి అన్ని కంపెనీలల్ల పనిగంటలెక్కువయినయి! అందరికీ టెన్షన్ పెరిగింది.

సాఫ్ట్‌వేర్ అంటే వున్న గౌరవం తరిగింది. సాఫ్ట్‌వేర్‌లో కూడా మోసమా? దగా! – ఛీ! పాడు దేశం. దేన్ని వదలరు! అన్నిటిని ముంచుతారు! ఆ కంపెనీ మునిగినకాన్నుంచే డబ్బు ఆదా అంటూ పనిచేసే వాళ్ళను ఎంతోమందిని పనిల నుంచి తీసేసారు. అప్పట్నుంచే కిరణ్ ఇట్ల ఆలస్యంగ ఇంటికి రావటం ఎక్కువయింది.

ఏమన్నంటె పని! పని! – అంటడు. పని ఎక్కువెందుక్కాదు? – అంతమందిని నౌకరీల నుంచి తీసేసినంక మిగిలిన వాళ్ళ నెత్తిమీద పని పడక ఏమైతది? నలుగురు చేసే పని కిరణ్ ఒక్కనీ నెత్తిమీద పడ్డది. నెత్తిమీద పడ్డ పని చేయందే కదలరాదాయె? ఆఫీసేమోగాని జెయిల్‌కన్నా ఎక్కువైంది!

కార్ఖానల్ల కార్మికులయిన ఇన్ని గంటలు పనిచేయరేమో! అంతెందుకు రోజు కూలి పనోడు సుత ఇన్ని గంటలు పని చేస్తలేడు! కార్మికులకన్నా కూలివానికన్నా హీనమై పోయిరి సాఫ్ట్‌వేర్లు! కాయకష్టం జేస్తే శరీరం అలసిపోతది. నిజమేగాని మెదడుతో పనిజేస్తే అలసిపోద? అదెవరు పట్టించుకుంటలేరు! శరీరశ్రమ ఎంతో మెదడు శ్రమ అంతేగద! అలసిపోయి ఇంటికి వచ్చిన కిరణ్‌ను జూస్తే రోజు పాపమనిపిస్తుంది. ఈ మధ్య కిరణ్‌కు కండ్ల సమస్య కూడా మొదలైంది. కంప్యూటరు దిక్కు ఏకంగ చూసి చూసి ఇట్లయిందన్నడు కండ్ల డాక్టరు. కండ్లు భద్రం అంటు హెచ్చరించిండు కూడా. డాక్టరేమో కిరణ్ కండ్లకు విశ్రాంతి ఇయ్యాలంటడు. కిరణ్ అదేమి వినిపించుకోడు. పట్టించుకోడు. ఇట్ల ఇన్ని గంటలు కంప్యూటరు ముందల కూర్చుంటె కండ్లకు విశ్రాంతి ఎక్కడ్నుంచి దొరుకుతది! సెలవురోజు ఇంట్లో వున్నా కంప్యూటరు ముందల కూర్చోవల్సిందే! ఇదేంది అంటె ఆఫీసు పని. కొంచెం ప్లీజు! అంటడు. కొంచెం అన్నోడు రోజంత అదే పనిల మునిగితేలుతడు..." రమ ఆలోచనకు బ్రేక్ పడింది హఠాత్తుగా. ఆమె చూపులు గోడ గడియారం వైపు తిరిగాయి.

"ఒకటిన్నరయింది! – పొద్దున ఏడుగంటలకు ఇంట్లనుంచి పోయినోడు రాత్రి ఒకటి దాటినా ఇంటికి రాలేదు! – అట్లని జీతమేమన్నా పెరిగిందా? – అంటె మొదటికే

మోసం వచ్చింది. నలభై వేల జీతం ఇరవై వేలయింది! ఇదేం అన్యాయమని బాస్‌ను అడిగితే ఏం చేయమంటరు ప్రాజెక్టులు లేవు. విదేశాలనుంచి వచ్చే ప్రాజెక్టులు లేవు. విదేశాలనుంచి వచ్చే ప్రాజెక్టులు ఆర్థికమాంద్యం! పొదుపు! – అంటూ రావటం లేదు అన్నాడు. ఇగ కావలిస్తే మీరు వేరే చోట ఉద్యోగాలు చూసుకోండి! – అని చేతులెత్తేసారు కంపెనీ యాజమాన్యం. ఉద్యోగాలు చూసుకోండి మాకేం అభ్యంతరం లేదంటె వాళ్ళకేం అభ్యంతరముంటుంది! – వున్నవాళ్ళతోటే పగలనక రాత్రనక పని చేయించుకోబట్టిరి. అయినా ఇన్ని గంటలు పని చేస్తే భార్యా పిల్లలు లేరా? ఇల్లు వాకిలి లేవా? ఇన్ని గంటలు పనేంది?" – రమ మనస్సులో ఉడికిపోతున్నది.

"ఇరవై వేల జీతంతో బతుకెట్ల సాగుతది? ఇల్లు కిరాయి కట్టినట్లే వుంటది కదా అని బ్యాంకు అప్పు తీసుకొని కొన్న ఫ్లాటుకు అప్పుకింద నెలకు పదివేలు కట్టాల్నాయె. పిల్లలిద్దరి స్కూలు ఫీజు నెలకు రెండువేలు. ఆటో ఖర్చులు రెండువేలు. ఇవన్నీ పోతే మిగిలేది ఎంతని? ఇంటి ఖర్చులు ఎట్ల గడుస్తయి. లేబర్ పనివాళ్ళే నయమేమో. వాళ్ళకు ఇన్ని పని గంటలు వుండవు. ఇన్ని ఖర్చులూ వుండవేమో!– వాళ్ళు శారీరక కష్టం చేసి అలసిపోతే సాఫ్ట్‌వేర్లు మానసిక కష్టం చేసి అలసిపోతరు. మానసిక కష్టం మనిషికి ఒత్తిడి కలిగిస్తుంది. అయినా ఇన్ని గంటలు పనిచేస్తే మనిషి ఎన్నాళ్ళు పనిచేయగలుగుతాడు? తొందరగా రిటైర్ కాకతప్పదు. రిటైరయితే ఏముంది? పెన్షనా? – ఏమన్నానా? రిటైర్‌మెంట్ జీవితం కోసం ఇప్పుడే ముందు జాగ్రత్తగా జీతంలోంచి ఆదా చేసుకోవాల్నాయె! నాన్నకయితే హాయిగా పెన్షన్ వస్తున్నది. ఏ చీకూ చింతా లేకుండ జీవితం సాగిపోతున్నది. అయినా సాఫ్ట్‌వేర్ల జీవితాలు కార్మికుల జీవితాలకన్నా నికృష్టంగా వున్నాయి. వాళ్ళ పని గంటల గురించి వాళ్ళ శ్రమ విలువ గురించి ఎవరూ మాట్లాడరేంది? ఎవరు పట్టించుకోరేంది?" – ఆలోచిస్తుంటె ఆలోచిస్తుంటే రమలో అశాంతి ఎక్కువవుతున్నది. గోడవైపు చూసింది.

రెండయింది!

బయట కిరణ్ మోటర్‌బైక్ చప్పుడు వినిపించింది. రమ ఆతురతతో దబదబ పోయి తలుపులు తెరిచింది. అలసిపోయిన వాడిపోయిన కిరణ్ మెల్లెగా నడుస్తూ లోపలికి వచ్చాడు. అతని కండ్లు అలసట నిద్రతో వాలిపోతున్నాయి. మనిషి సోలుతున్నాడు. మాట్లాడే స్థితిలో లేడు. పడక గదివైపు నడిచాడు.

"ఇటు రండి! అలసట తీరేటట్లుగా వేడినీళ్ళతో స్నానం చేసి భోంచేసి నిద్రపోదురుగాని..." అంది రమ.

"అబ్బ! ఇప్పుడు స్నానం చేసే ఓపిక లేదు రమ! భోజనం అక్కడే ఆఫీసులో అయిందనిపించేసాం. ఆకలి లేదు. పడుకుంటాను. నిద్రొస్తున్నది... ఓ శుభవార్త నీకు – అమెరికా నుంచి మాకు ఓ ప్రాజెక్టు వచ్చింది. అమెరికా నుంచి మాకు వార్త అందేసరికి అర్థరాత్రయింది. వివరాలన్నీ అందింతర్వాతనే బాస్ మమ్మల్ని వదిలాడు. కొన్నాళ్ళవరకు మా నౌకరీకి ఏం డోకా లేదు... హ్యాప్పీ! హ్యాప్పీ...!" అంటూ కిరణ్ పడక గదిలోకి పోయి మంచంమీద వాలిపోయాడు. బట్టలు మార్చుకునే ఓపిక కూడా లేదతనికి. స్పృహ దప్పినవాడి లాగా నిద్రపోతున్న భర్తవైపు చూసింది రమ. ఆమె కండ్లు

ఆర్ద్రమయ్యాయి. అతని పక్కనే ఆమె వాలిపోయింది. కాని నిద్ర రాలేదు. కండ్లు నిద్ర లేక మండిపోతున్నాయి. అయినా నిద్ర రావటం లేదు.

"ఈ సాఫ్ట్‌వేర్ కార్మికుల కష్టాలు ఎవరు తీరుస్తారు! వాళ్ళ పని గంటల గురించి ఎవరు నిరసనలు నిరశనవ్రతాలు చేయటం లేదు. ఎందుకింత నిశ్శబ్దంగా శోషణను శ్రమదోపిడిని భరిస్తున్నారు వాళ్ళు. ఎవరైన మరో మార్క్స్ వంటివాడు పుట్టి వస్తే తప్ప వాళ్ళ కష్టాలు శ్రమ దోపిడులు అన్యాయాలు తీరవా? ఆ మరో మార్క్స్ వచ్చేదెప్పుడు?" – నిట్టూర్చింది రమ.

*"వార్త" ఆదివారం, 22 నవంబరు, 2009*